క్లుప్తంగా

10న కాణిపాకంలో వైకుంఠ ఏకాదశి

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధంగా ఉన్న శ్రీ వరదరాజులస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని ఈ నెల 10వతేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. పట్టువస్త్ర సమర్పణ, వేకువజామున అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత తెలిపారు. తిమ్మయ్యపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో రోగులు మండల కేంద్రాలకు రావాల్సి ఉండేదని, ప్రస్తుతం గ్రామంలోకి వైద్యసేవలు తీసుకు వచ్చినట్లు వివరించారు. అనంతరం షుగర్, బీపీ, గర్భిణులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరిత, శిల్ప, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

పాలసముద్రం: మండలంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల చైల్డ్‌లైన్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ చెంచయ్య గ్రామాఖ్య సంఘ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై మహిళలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం వెంకటేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. బాల కార్మికులను నిర్మూలనపై అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం జెండర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీఐ క్యాలెండర్ ఆవిష్కరణ

గంగాధర నెల్లూరు: సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సంస్థ ప్రతినిధులు బండి పట్టాభిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పండగ పూట.. ధరల మంట

పండగ పూట నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. పప్పులు, కూరగాయలు, వంటనూనెలు, పండ్లు.. ఇతర సరుకుల ధరలు సమాన్యులకు అందనంతగా పెరిగిపోయాయి. ఎన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. దీంతో నిత్యావసర సరుకులను ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో పెరిగిన నిత్యావసర ధరల కారణంగా ప్రతి కుటుంబంపై రూ.5వేల నుంచి రూ.10వేలు అదనపు భారం పడుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.



సంతలో విక్రయిస్తున్న కూరగాయలు

- భారీగా పెరిగిన నిత్యావసరాలు
- మండుతున్న వంటనూనె ధరలు
- పప్పులు, కూరగాయలదీ అదే దారి
- అల్లాడుతున్న సామాన్య మధ్య తరగతి ప్రజలు

గుడిపాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో 75వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 80శాతం కుటుంబాలు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల లోపే. గతంలో ఓ కుటుంబానికి నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి రూ.10వేల వరకూ ఖర్చు అయ్యేది. ఇదే క్రమంలో పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. దీంతో సామాన్యులు తమ ఆదాయ వనరుల ప్రకారం ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

కాగుతున్న వంటనూనెలు

పండుగ వేళ వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ లీటరు రూ.140 నుంచి రూ.150 పలుకుతోంది. పిండి వంటలకు అధికంగా వినియోగించే పామాయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ. 125 నుంచి రూ.135 పలుకుతోంది. గతేడాది పండుగకు రిఫైండ్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.110 నుంచి రూ.115 వరకు ఉండేది. పామాయిల్ ప్యాకెట్ ధర రూ.100 నుంచి రూ.105 వరకు ఉండేది. దీనికి భిన్నంగా ఈ ఏడాది సంక్రాంతికి వంట నూనె ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు తల్లడిల్లుతున్నారు.

దిగిరాని పప్పుల ధరలు

నిత్యావసర ధరలు పెరగడంతో మార్కెట్ వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.40 తగ్గడం లేదు. ఉల్లిపాయలు కిలో రూ.50 ధర ఉంది. కంది, పెసర, ఉద్దిపప్పు దినుసులు కిలో రూ.150 నుంచి రూ.170 వరకు ఉంది. మార్కెట్‌లో కందిపప్పు నాణ్యత ఆధారంగా కిలో రూ.150 నుంచి 170 వరకు ఉంది. ఉద్దిపప్పు కిలో రూ.125 నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు. పెసరపప్పు కిలో రూ.120 నుంచి 150 వరకు అమ్ముతున్నారు. శనగపప్పు ధర రూ.120పైనే. వేరుశనగ కిలో రూ.130 నుంచి రూ.150 వరకు ఉండగా, వెల్లుల్లి కిలో రూ.380కు తగ్గడం లేదు.

రూ.5వేలు అదనపు భారం



నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు పెరిగిపోయాయి. దీంతో నెలకు అదనంగా రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి మాది. పెరిగిన ధరల కారణంగా ఖర్చు రెట్టింపు కావడంతో కూరగాయలు తక్కువగా కొనుగోలు చేస్తున్నాం.

–చిరంజీవి, గుడిపాల

ధరలు పెరిగాయి



ఎన్నడూ లేని విధంగా మార్కెట్లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ అయిపోతోంది. దీంతో ఏమీ కొనలేకపోతున్నాం. కూరగాయలు, ఉల్లిపాయల ధరలు భయపెడుతున్నాయి.

–నీలావతి, నరహరిపేట, గుడిపాల

స్కానింగ్‌తో చెల్లింపులు

చిత్తూరు కార్పొరేషన్: ఈ నెల నుంచి ఇస్తున్న విద్యుత్ బిల్లులను స్కానింగ్ విధానంతో జారీ చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. బిల్లు కింద భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. వాటిని యూపీఐ యాప్స్‌లో స్కాన్ చేయాలన్నారు. బిల్లు మొత్తం చూపినప్పుడు చెల్లింపులు చేయాలన్నారు. గత ఆరునెలలుగా యూపీఐ ద్వారా డైరెక్ట్‌గా బిల్లులను కట్టే విధానం ఆర్‌బీఐ నిబంధనల మేరకు ఆపివేశారన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ సైట్ లేదా లింక్ లేదా విద్యుత్ వసూలు కేంద్రాల్లో బిల్లులు కట్టేవారని చెప్పారు. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ విధానంతో క్యూలో నిలబడే పనిలేకుండా ఉన్నచోట నుంచి బిల్లు కట్టవచ్చన్నారు. ఆన్‌లైన్ చెల్లింపులకు సహకరించాలన్నారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

22న విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు తెలపవచ్చన్నారు. సమస్యలను అర్జీల రూపంలో విన్నవించాలని వివరించారు.

18న మండల సమావేశం

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలి



సెమినార్‌లో ఏఐ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్: యువత కృత్రిమ మేధస్సుపై పట్టు పెంచుకోవాలని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సు (ఏఐ) అంశంపై సెమినార్ నిర్వహించారు. పాల్గొన్న ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సుతో ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటుందని చెప్పారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై పట్టు పెంచుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇది విభిన్నమైనది

సహజ మేధస్సు కంటే కృత్రిమ మేధస్సు ఎంతో విభిన్నమైనదని వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర తెలిపారు. దీని ద్వారా ఎన్నో విషయాలను క్షణాల్లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సెమినార్ సంచాలకులు వినీల మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో విద్యార్థులు ఎక్కువ శాతం బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కంప్యూటర్స్ సైన్స్‌నే ఐచ్ఛికాంశాలుగా తీసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు బాగా ఉపయోగపడే కృత్రిమ మేధస్సుపై అవగాహన కల్పించేందుకు సెమినార్ నిర్వహించినట్లు చెప్పారు.

విప్లవాత్మకమైన మార్పులు

చెన్నై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి విచ్చేసిన డైరెక్టర్ సౌజన్య మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుకు సంబంధించి యాప్‌లు, పరిశ్రమలు, తదితర రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయన్నారు. మన చేతిలోని మొబైల్ ఒక కృత్రిమ మేధస్సును అరచేతిలో చూపిస్తుందన్నారు. మొబైల్‌లో ఉన్న గూగుల్, చాట్ జీపీటీ, మెటా ఏఐ మొదలైన యాప్‌లతో అతి తక్కువ సమయంలో కొన్ని వందల పేజీల డేటాను డౌన్‌లోడ్ చేస్తుందన్నారు. వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి విచ్చేసిన విశ్రాంత ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు అనే పదం మొదటి సారి 1950లో రూపొందించినట్లు తెలిపారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) 2025లో కృత్రిమ మేధస్సు సంవత్సరంగా భారతదేశాన్ని ప్రపంచంలోనే ఉన్నత స్థానంలో నిలబెడుతోందన్నారు. అనంతరం సెమినార్‌లో ఏఐ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సెమినార్‌లో పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు తిరుకుమరన్, షమ్సు అక్తర్, ఉషారాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా యూకో బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఏపీఎం, బ్యాంక్ సిబ్బంది

ఐరాల: స్థానిక యూకో బ్యాంక్‌లో సోమవారం 83వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎం నాగరత్న హాజరయ్యారు. ఏపీఎం మాట్లాడుతూ రానున్న కాలంలో బ్యాంక్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరారు. బ్యాంకు ఖాతాదారులకు, సిబ్బందికి 83వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంక్ మేనేజర్ భానుచందర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా మహిళలకు, రైతులకు విరివిగా తక్కువ వడ్డీలతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి బ్యాంకు కొత్త స్థలంలోకి మార్చడానికి హెడ్ ఆఫీస్ నుంచి అనుమతి లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఖాతాదారులకు, సిబ్బందికి పంచిపెట్టారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది భానుప్రకాష్, లోహిత, దిక్సతి, బాషా, జవహర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



గంగాధర నెల్లూరు: మండలంలో సోమవారం ఉదయం 10 గంటల వరకు కూడా పొగ మంచు కప్పేసింది. తీవ్రమైన చలితో పాటు దట్టమైన పొగ మంచు దుప్పటిలా పరుచుకుంది. ప్రయాణికులు వాహనాలకు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కూలి పనులకు వెళ్లే శ్రామికులు ఈ చలి తీవ్రత వల్ల ఇబ్బందులు పడ్డారు. శ్వాసకోశ ఇబ్బందులు ఉండే ప్రజలు ఈ చలికి బయట తిరగకుండా, దూరంగా ఉండడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: చలికాలంలో వృద్ధులు, చిన్నారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. మంచు కురుస్తున్నందున చలి అధికంగా ఉంటుందని, దీంతో జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఎవరూ ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట ఉన్ని రగ్గులను కప్పుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమలు కుట్టకుండా వేపాకు పొగ, దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు





వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, వైద్యం చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: మండలంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే సంకల్పంతోనే గ్రామాలకు వైద్య బృందం విచ్చేస్తోందని డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మల్లకుంటలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. 43 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పుణ్యసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. బీపీ, సుగర్‌వాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేయించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బయటకెళ్లాలంటే బండెక్కాల్సిందే!



- మనం జాగ్రత్తగా నడుపుతున్నామా?
- నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో కష్టాలు తప్పవు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రస్తుతం ఎవరైనా ఇంట్లో నుంచి కాలు బయటపెడితే బండెక్కాల్సిందే. పట్టుమని పది అడుగులు వేసే పరిస్థితి లేదు. ఏదైనా చిన్న వస్తువు కావాలన్నా.. పర్లాంగు దూరం వెళ్లి రావాలన్నా బైక్‌నే ఆశ్రయిస్తున్నారు. అందుకే గతంలో ఇంటికో బైక్ ఉంటే ఇప్పుడు మనిషికో బండి ఉంది. బండి లేకుండా బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. అయితే త్వరగా పనులు పూర్తి చేసుకునేందుకు వాహనచోదకులు ఆగమేఘాల మీద దూసుకెళుతుంటారు. ఇప్పటికీ నగర, గ్రామీణ ప్రాంతాల్లో కూడా 100 కుటుంబాలకు 95 మందికి వాహనాలను కలిగి ఉన్నారు. ఎక్కువగా యువకులే మార్కెట్లోకి వచ్చిన కొత్త కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. తల్లిదండ్రులు కూడా వారి ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను కొనివ్వడం ఇటీవల అధికమైంది. అంతే కాక గ్రామాల్లో సైతం ఎక్కడ వెళ్లాలన్నా యువకుల నుంచి పెద్దల వరకు బండి లేనిది ముందుకు కదలడం లేదు. చాలా మంది డ్రైవింగ్‌లో మెలకువలు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. మరికొందరు నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు.

వానకు తడిస్తే ప్రమాదమే

వర్షాకాలంలో వాహనం ఎక్కువగా వర్షానికి తడిస్తే షార్ట్ సర్క్యూట్ అయి కాలిపోయే ప్రమాదం ఉంది. ఇంటి దగ్గరైనా కవర్ కప్పడం మేలు. సెల్ఫ్ స్టార్టర్ కంటే కిక్ కొడితే బ్యాటరీపై భారం తగ్గుతుంది. బైకు తాళంలో వర్షపు నీరు వెళ్లకుండా చూసుకోవాలి.

టైర్ మార్పు

బైకు టైర్ 50 వేల కిలోమీటర్లు తిరిగి ఉంటే మార్చుకోవడం ఉత్తమం. దీంతో వర్షంలో స్కిడ్ కాకుండా ఉంటుంది. ఎక్కువగా వర్షం పడేటప్పుడు బైకు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

నిర్లక్ష్యం వల్ల ఆరోగ్య సమస్యలు

- బైక్ నడిపేటప్పుడు ప్రతి కదలిక వెన్నుపూసపై పడుతోంది. అతి వేగంతో వాహనాన్ని నడుపుతూ అంతే వేగంతో ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో మెడ నుంచి నడుము వరకు కండరాలు, నరాలు ఊగిపోతాయి.
- బండి నడిపేటప్పుడూ సెల్‌ఫోన్‌లో ఏట్టి పరిస్థితుల్లోనూ మాట్లాడకూడదు. ఒక వేళ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే మెడ నొప్పి వస్తుంది. స్పీడ్ బ్రేకర్ల మీదుగా బైక్‌కు వెళ్తున్నపుడు వెన్నుపూసపై వంద నుంచి వెయ్యి శాతం భారం పడుతుంది. స్పీడ్ బ్రేకర్ మరింత ఎత్తులో ఉంటే ఆ ప్రభావం రెండింతలు ఉంటుంది.
- రహదారుల్లో ఏర్పడిన గుంతల్లో బైకు నడిపినా వెన్నెముకపై ప్రభావం అధికంగా ఉంటుంది. అతి వేగం కన్నా గుంతలను, స్పీడును తగ్గించి వాహనం నడపడం శ్రేయస్కరం.
- యువకులు షార్ట్ హ్యాండిల్ బిగించడంతో వెన్నుపూస భుజాలపై భారం పడి దీర్ఘకాలిక నొప్పులు వచ్చే అవకాశం ఉంది.
- షాక్ అబ్జర్వర్లు కండీషన్‌లో లేకపోతే వెన్నుపూస సమస్యలు వస్తాయి.

మద్యం తాగి నడపడం నేరం

మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. మద్యం తాగి బండి నడపకూడదన్న విషయాన్ని వాహనచోదకులు గమనించి పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హెల్మెట్ తప్పనిసరి

రోడ్డు ప్రమాదాల బారినుంచి రక్షించుకోవడానికి బైకుపై ప్రయాణించే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించి వెనక వస్తున్న వాహనాన్ని చూడాలంటే ఇబ్బందికరమే. అయితే ఇందుకోసం బైకు సైడ్ మిర్రర్‌ను ఉపమోగిస్తే సరిపోతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వాహనాన్ని నడిపే సమయంలో చాలా మంది సైడ్‌స్టాండ్ తోసుకోవడం మరచిపోతుంటారు. దీని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.
- బైక్ నడిపేటప్పుడు ప్రధానంగా రహదారిపైనే దృష్టి పెట్టాలి. రోడ్డు ఇరువైపులా చూస్తూ నడిపితే ప్రమాదాలకు గురికావాల్సిందే.
- బైకు నడిపేటప్పుడు మోచేతులు నిటారుగా ఉంచకూడదు. కొంచెం వంచి హ్యాండిల్‌ను రిలాక్స్‌గా ఉంచుకోవాలి.
- పెట్రోల్ ట్యాంకు దగ్గరగా రెండు మోకాలు ఉంచి, బ్యాలన్స్ పొందేలా చూసుకోవాలి.
- బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా కాళ్లకు తొడిగిన బూట్లు, చెప్పులను ఫుట్‌రెస్టుపైనే ఉంచుకోవాలి. అలా చేయడంలో బ్రేకులు, గేర్లు సులువుగా మార్చుకోవడానికి అనువుగా ఉంటుంది.
- మూడు నెలలకు, మూడు వేల కిలోమీటర్లకు ఒకసారి బైకును సర్వీస్ చేయించాలి. దీంతో బండి ఇంజిన్ కండీషన్ బాగుంటుంది.

11న వడ్డే ఓబన్న జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): వడ్డే ఓబన్న జయంతిని చిత్తూరులో ఈనెల 11న ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ ఆహ్వాన కమిటీ నాయకులు రవీంద్రరాజు తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వడ్డే ఓబన్న జయంతి సభ నిర్వహిస్తామన్నారు. ముందుగా గాంధీ విగ్రహ కూడలి నుంచి భారీ ర్యాలీ ఉంటుందని చెప్పారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, వడ్డెర సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. తెలంగాణ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని విన్నవించారు. ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కులవృత్తుల వారికి పనిముట్లు, యంత్రాలకు నిధులు మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు మురళి, ధరణి ప్రకాష్, గుర్రప్ప, బోడబండ్ల అశోక్, మణికంఠ, బాబు, హరిబాబు, సంజీవి, సుధాకర్ పాల్గొన్నారు.